క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

నల్లగొండ టౌన్ : వడగండ్ల వాన కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం కురిసిన వడగండ్ల వానతో నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడ్ మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పల్లా దేవేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

కనగల్ : మండల పరిధిలోని రాంచంద్రాపురం గ్రామంలో ఈ నెల 20 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు అందుగుల భిక్షపతి, కె లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 7730063884, 9959083937 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

24న సంత వేలం

మునుగోడు : నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో ప్రతి గురువారం జరిగే పశువుల, కూరగాయల సంతల వేలం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వ్యాపారులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం లోపు మునుగోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పేరిట పశువుల సంతకు రూ. 80 వేలు, కూరగాయల సంతకు రూ.50 వేల చొప్పున డీడీలు కట్టి వేలంలో పాల్గొనాలన్నారు. గతంలో సంతల వేలం తీసుకొని పూర్తిస్థాయిలో వేలం డబ్బులు చెల్లించనివారికి వేలంలో పాల్గొనే అవకాశం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

చిట్యాల : విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కేటీఎస్ విద్యాసంస్థల చైర్మన్ రాజు, ఎంజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాధరి అన్నారు. చిట్యాలలో కేటీఎస్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ ధర్మా, స్కూల్ డైరెక్టర్స్ కె.శ్రీధర్, నగేష్, ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లపంగి రత్నం కుమారుడు (ఏడాది వయస్సు) శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి.. దళితబంధు జిల్లా కమిటీ సభ్యుడు లపంగి నర్సింహ ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వడ్డె నరేష్, లపంగి కృష్ణ, అనంతం, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

నల్లగొండ రూరల్ : టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని టీడీపీ నల్లగొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎల్వీ యాదవ్ అన్నారు. శుక్రవారం పానగల్లు ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 19 వార్డులో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీతోనే పేదలకు రాజకీయ ప్రాధాన్యత లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ఇస్తారి, నాగరాజు, సిద్ధిక్, చంద్రశేఖర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయాలి

నల్లగొండ టౌన్ : చివ్వెంల బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతికి కారణమైన ప్రిన్సిపాల్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోలు దీపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిజాల వెంకటేశ్వర్లు, బోల్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సాయి, శ్రీకాంత్, సంపత్ పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

నకిరేకల్ : నకిరేకల్ పట్టణం చుట్టూ ఉన్న చెరువులు, కుంటల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఎర్ర కుంటలో ఈతకు వెళ్లి చనిపోయిన 10 ఏళ్ల బాలుడు సాత్విక్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపకుండా విద్యకు సంబంధించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వేసవిలో జరిగే ప్రమాదాలపై ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సరియైన అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట యానాల లింగారెడ్డి, బొజ్జ సుందర్, యాసారపు వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చివరి భూములకు అందని నీరు

- ఇష్టారాజ్యంగా కాలువకు గండిపెడుతున్న ఎగువ రైతులు
- తిప్పర్తి మండలంలో ఎండిపోతున్న పంటలు


తిప్పర్తి మండలంలోని మర్రిగూడ గ్రామ సమీపంలో ఆనవాళ్లు కోల్పోయిన కాలువ


మర్రిగూడ శివారులో నీరు రాక ఎండిపోయిన లింక్ కెనాల్

రామగిరి(నల్లగొండ) : ఉదయం సముద్రం (పానగల్లు) రిజర్వాయర్ నుంచి ఏఎమ్మార్పీ లింక్ కాలువల ద్వారా తిప్పర్తి మండలంలోని పంట పొలాలకు వెళ్లే సాగు నీటి కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. చివరి భూములకు నీరు అందకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. బోరు నీరు సరిపోక, ఇటు కాలువ ద్వారా నీరు అందక కొంతమంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టులు ధ్వంసం కావడం, రైతులు నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేయడం వల్ల నీరు సాఫీగా కిందకు వెళ్లడం లేదు. తిప్పర్తి నుంచి ఇండ్లూరు వెళ్లే దారిలో డీ 40 కాలువలో ఎత్తుగా కట్టిన కల్వర్టును దిగువన ఉన్న రైతులు ధ్వంసం చేశారు. దీనికి తోడు లింక్ కెనాల్‌కు ఎగువన ఉన్న రైతులు అడ్డుకట్టలు వేసి నీరు ఆపుతున్నారు. మరోపక్క కొంతమంది రైతులు నేరుగా కాలువకు మోటార్లు బిగించి నీటిని తోడుతున్నారు. మరి కొంతమంది రైతులు కాలువ అడుగుభాగంలో కేసింగ్ పైపు అమర్చి పొలాలకు నీరు పెట్టుకుంటున్నారు. దీంతో చివరన ఉన్న రైతుల భూములకు నీరు అందడం లేదు.

మండలంలో మూడు ఏఎమ్మార్పీ కాలువలు

తిప్పర్తి మండలంలో మొత్తం మూడు ఏఎమ్మార్పీ కాలువల ద్వారా వ్యవసాయానికి సాగు నీరు అందుతోంది. డీ 37, డీ 39, డీ 40 మూడు ఏఎమ్మార్పీ కాలువలు మండలం గుండా ప్రవహిస్తున్నాయి. డీ 37 కాలువ 7 నుంచి 8 కిలోమీటర్ల పొడవు ఉంది. దీని పరిధిలో 3 నుంచి 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. డీ 39 కాలువ 16 కిలోమీటర్లు ఉండగా 10 వేల ఎకరాల ఆయకట్టు పారుతుంది. డీ 40 కాలువ 17 కిలో మీటర్లు వ్యాపించి ఉంది. దీని ద్వారా మండలంలో 18 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కాలువలను పర్యవేక్షించి దిగువన ఉన్న రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లింక్ కెనాల్ ఎత్తు తగ్గించాలి



డీ 40 నుంచి మర్రిగూడ రైతులకు వచ్చే లింక్ కెనాల్ ఎత్తు తగ్గించాలి. ప్రధాన కాలువకు లింక్ కాలువ ఎత్తున ఉండడం వల్ల నీటి ప్రవాహం తక్కువగా వస్తోంది. దీనికి తోడు ఎగువన ఉన్న రైతులు అడ్డుకట్టలు వేయడంతోపాటు మోటార్లు, పైపులు బిగించడం వల్ల దిగువన ఉన్న రైతులకు నీరు రావడం లేదు. అధికారులు పర్యవేక్షణ చేసి నీరు అందేలా చూడాలి.

– మారుపాక కొండయ్య, మర్రిగూడెం

ఇష్టారాజ్యంగా మోటార్లు బిగించుకుంటున్నారు



కాలువకు ఇష్టారాజ్యంగా మోటార్లు బిగించుకుంటున్నారు. మరి కొంతమంది రైతులు కాలువకు అడ్డుకట్టలు వేస్తున్నారు. అటు మోటార్ల ద్వారా వచ్చే నీరు సరిపోక, కాలువ ద్వారా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో చివరి భూములకు నీరు రావడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులందరికీ సాగు నీరు అందేలా చూడాలి.

– గుండు వెంకన్న, తిప్పర్తి

నీరు అందేలా చర్యలు చేపడతాం

తిప్పర్తి మండలంలోని ఏఎమ్మార్పీ కాలువను పర్యవేక్షిస్తాం. చివరన ఉన్న రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైన చోట మరమ్మతులు చేపడతాం. కాలువకు మోటార్లు బిగించిన, అడ్డు కట్టలు వేసిన వారిపై శాఖాపరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శివరామ్ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నీటి పారుదల శాఖ

తహసీల్దార్‌కు వినతి

చిట్యాల : పట్టణంలోని సర్వే నంబర్ 651లో గల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి అక్బర్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి పబ్బు విగ్నేశ్వర్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, రైతు సంఘం నాయకులు గుండాల సత్తయ్య, వర్గాల గోపాల్ పాల్గొన్నారు.

భూమి ఆక్రమించేదుకు ప్రయత్నిస్తున్నారని..

మర్రిగూడ : తప్పుడు ధృవపత్రాలు సృష్టించి తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాణాల కృపాచారి శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిగూడ గ్రామం సర్వే నంబర్ 168లో 63 గుంటల వ్యవసాయ భూమిని కొందరు ఇళ్ల స్థలాలకు గతంలో అమ్ముకున్నారని అన్నారు. 2009 నాటికే వారి పేర్లు రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించినప్పటికీ నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నించడమే కాకుండా దాడులకు పాల్పడుతున్నారని కృపాచారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట శ్రీనివాస్, వెంకటేష్, మల్లయ్య, తిరుమలేష్ ఉన్నారు.

ఎరుకల కులస్తులకు మూడెకరాల భూమి ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎరుకల కులస్తులకు మూడెకరాల భూమి ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీల్లో అత్యంత వెనుకబడ్డ ఎరుకలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. యువతకు 90 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలన్నారు. మాడా స్కీం ద్వారా ఎరుకలకు ఈత కట్టె సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వెంకన్న, తిరుమల్, మల్లయ్య పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామంలో శుక్రవారం ఓ యువకుడిపై మరో వ్యక్తి కర్రతో దాడి చేశాడు. వివరాలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వనం విజయ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్రామంలో తమ బంధువుల వివాహం ఇక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో విజయ్ గ్రామంలోని బెల్టు దుకాణంలో మద్యం తాగి పలువురితో గొడవ పడ్డాడు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన ఉడుగుండ్ల రాములు అనే వ్యక్తి విజయ్ ఇంటికి వెళ్లి మందలించాడు. విజయ్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రాములు అక్కడే ఉన్న కర్రతో అతడిని బలంగా కొట్టాడు. దీంతో విజయ్ తలకు గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు మునుగోడులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ రెడ్డి తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి దాడి చేసిన రాములును అదుపులోకి తీసుకున్నారు. కాగా.. గ్రామంలో 10 ఏళ్ల క్రితం వివిధ కారణాల కారణంగా ముగ్గురు హత్యకు గురయ్యారు. అయితే హత్యకు గురైన వారిలో ఒకరి కుమారుడు ఈ విజయ్. గతంలోలాగా ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటాయేమోనని గ్రామస్తులు ఆందోళనలు చెందుతున్నారు. ఎప్పటికప్పుడు గస్తీ చేపట్టాలని కోరుతున్నారు.

మురుగు కాల్వల పరిశీలన

నకిరేకల్ : గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అధికారులకు సూచించారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించి మురుగు కాల్వలను పరిశీలించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. బెజవాడ లక్ష్మీనారాయణ, కోటగిరి రాధాకృష్ణ, ప్రవీణ్, సంపత్, శేఖర్, దయాకర్, గోపాల్, రాజు, నాగరాజు, సందీప్, వివేక్ ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


నల్లగొండలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : రంగారెడ్డి–హైదరాబాద్–మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి విజయం సాధించడంతో శుక్రవారం నల్లగొండలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక పెద్ద గడియారం సెంటర్‌లో టపాసు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులంతా ఏకమై అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థిని ఓడించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, దాసోజు యాదగిరాచారి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, బొజ్జ నాగరాజు, కంకణాల నాగిరెడ్డి, పాలకూరి రవిగౌడ్, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపస్ విజయోత్సవ ర్యాలీ

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో తపస్ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించడంపై నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తపస్ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుబెల్లి భిక్షపతి, విజయ్‌కుమార్, మల్లికార్జున్, శ్రీరాములు నాయక్, వెంకట్‌రెడ్డి, ఏ.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, చక్రధర్, నర్సింహ, తులసి, అమృతారెడ్డి, వెంకటేశ్వర్లు, శంకరాచారి, విష్ణు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడంపై నకిరేకల్ పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, నాయకులు గుడుగుంట్ల సాయన్న, అప్పం అంజయ్య, శ్రీనివాస్, పాలడుగు నగేష్, జానీ, గుర్రం నాగచంద్రు, గట్టు శ్రీకాంత్, నడికుడి నవీన్, వంగూరి యాదగిరి, కర్నాటి ఉదయ్, నల్లగొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


సమ్మె చేస్తున్న వీఓఏలు

కట్టంగూర్ : సెర్ప్‌లో పనిచేస్తున్న వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు బందం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండలంలోని వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ వీఓఏలకు ఆరోగ్య బీమా సౌకర్యం రూ.10లక్షలు కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గద్దపాటి నాగేష్, కోశాధికారి కంచర్ల సుజాత, ఉపాధ్యక్షురాలు పొడిచేటి సులోచన, ఎర్ర శైలజ, చేగోని నాగమణి, పబ్బు సరిత, నూనె శోభ, శ్రీధర్, ధనమ్మ ఉన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శాంతియుతంగా బీఎస్పీ కార్యాలయంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను చట్ట విరుద్ధంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని, గతంలో నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మహిళా కన్వీనర్ ఇంద్రపల్లి కవిత, జిల్లా ఇన్‌చార్జ్‌లు ఆదిమల్ల గోవర్దన్, కంబాల అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీమ్‌ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వంటెపాక యాదగిరి, అసెంబ్లీ అధ్యక్షుడు తుమ్మ లింగస్వామి, సైదులు, నర్సింహ, చిన్నపాక రాజశేఖర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘తప్పు చేయకుంటే విచారణకు భయమెందుకు’

నకిరేకల్ : లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత తప్పు చేయకుంటే విచారణకు ఎందుకు భయపడుతున్నారని టీపీసీసీ నేత దైద రవీందర్ ప్రశ్నించారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 77 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఉన్న సోనియా గాంధీ ఈడీ విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. కవితకు స్కాంలో పాత్ర ఉంది కనుకే భయపడి తెలంగాణ నుంచి మంత్రులను తీసుకెళ్లి మంతనాలు చేస్తున్నారని అన్నారు. ఆయన వెంట యూసఫ్ తదితరులు ఉన్నారు.

5న ‘చలో ఢిల్లీ’

చండూరు(గట్టుప్పల) : దేశంలో బీజేపీ నాయకత్వంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రంలోని సీపీఎం ప్రజాసంఘాల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాపల మారయ్య, కర్నాటి మల్లేశ్, శివకుమార్, రాములు, యాదగిరి, ఖమ్మం రాములు, సుధాకర్, ఎండీ రబ్బాని, వల్లూరి శ్రీశైలం, నరసింహ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎంజీయూ విద్యార్థి ప్రతిభ

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి రామినేని శివలింగేశ్వర సాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారని యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చండీగఢ్ యూనివర్సిటీలో అంతర యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2022–23లో శివ లింగేశ్వర సాయి ప్రతిభ కనబర్చి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

మల్లు స్వరాజ్యం పోరాటతత్వం స్ఫూర్తిదాయకం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం పోరాటతత్వం స్ఫూర్తిదాయకమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల సౌకర్యం కోసం ఇండోర్ స్టేడియాన్ని రూ.రెండు కోట్లతో ఆధునీకరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ మక్బూల్ అహ్మద్, కౌన్సిలర్ ప్రదీప్‌నాయక్, రెడ్‌క్రాస్ చైర్మన్ అమరేందర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, అరుణ్, యాట గోవర్ధన్‌రెడ్డి, పంతులు శ్రీనివాస్, ఆదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణయ్య, సయ్యద్ హాషం, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పట్టణంలోని 29వ వార్డు వంటిస్తంభం వివేకానంద స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, డీఎంఅండ్ హెచ్‌ఓ డా. అనిమల్ల కొండల్‌రావు, కౌన్సిలర్లు కొమ్ము నాగలక్ష్మి శంకర్, మారగోని నవీన్‌గౌడ్, శ్రీను, అభిమన్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టల వాడకం పెంచాలి


మాట్లాడుతున్న హార్టికల్చర్ యూనివర్సిటీ డీన్

కట్టంగూర్ : రైతులు పండ్ల తోటలు, కూరగాయల పెంపకంలో రసాయన మందుల వాడకం తగ్గించి, లింగాకర్షక బుట్టల వాడకం పెంచడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన వన విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ అండ్ డీన్ ఆఫ్ హార్టికల్చర్ అడపు కిరణ్‌కుమార్ సూచించారు. కట్టంగూర్‌లోని ఎఫ్‌పీఏ కార్యాలయంలో శుక్రవారం రైతులకు లింగాకర్షక బుట్టల వాడకంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటలకు పురుగు మందులు వాడడం వల్లనే మనుషులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పురుగు మందు రహిత వ్యవసాయాన్ని రైతులంతా చేపట్టాలని సూచించారు. అనంతరం 50 మంది రైతులకు లింగాకర్షక బుట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సంగీతలక్ష్మీ, కొండమల్లేపల్లి ఉద్యానవన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్.రాజుగౌడ్, నకిరేకల్ నియోజకవర్గ ఉద్యానవన శాఖ అధికారి ఆర్.విద్యాసాగర్, జీవ నియంత్రణ పరిశోధన ప్రయోగశాల వ్యవసాయ అధికారి ఎం.సరిత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ సీహెచ్.సైదమ్మ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయ లోపం

మునుగోడు : మునుగోడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది మధ్య కొంతకాలంగా కోల్డ్ వార్ నడుస్తోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ అమలు తీరును పర్యవేక్షించాల్సిన అధికారి వింత పోకడతోపాటు సిబ్బంది మధ్య సమన్వయం లోపించింది. దీంతో వారిమధ్య నిత్యం తగాదాలు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఫలితంగా ప్రాజెక్టు పరిధిలోని మునుగోడు, చండూరు, చిట్యాల మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లతో పాటు ఇతర సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

సొంత యూట్యూబ్ ఛానల్‌లో పోస్టింగ్‌లు పెట్టాలని..

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారి ఓ యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసుకుని, ఆ ఛానల్‌ను ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని, అందులో వచ్చిన వీడియోలు షేర్ చేస్తూ లైక్ కొట్టాలని ఆదేశిస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా సిబ్బంది తమ పరిధిలోని కేంద్రాల్లో వీడియోలు చిత్రీకరించి తన యూట్యూబ్‌లో పోస్టు చేయాలని ఆదేశిస్తున్నట్లు పలువురు మొరపెట్టుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా వీడియోలు తీసి పోస్టు చేయకపోతే వారి కేంద్రాలను సాయంత్రం సమయంలో సందర్శించి ఆ సమయంలో సిబ్బంది లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. వీటికితోడు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించకుండా మ్యానేజ్ చేసుకోవాలని సూచిస్తున్నట్లు సమాచారం. పండుగలు, పార్టీ మీటింగ్‌ల సమయంలో కొందరు చందాలు అడుగుతున్నారని, అవి కూడా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు కొందరు సిబ్బంది తమ స్నేహితులతో చెప్పుకుని కంటతడి పెట్టుకుంటున్నారు. ప్రతినెలా ప్రాజెక్టు మీటింగ్ మునుగోడులో నిర్వహిస్తే అనేక విషయాలు బయటపడతాయని, ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కోల్డ్‌వార్‌కు చరమగీతం పాడాలని ప్రాజెక్టు పరిధిలోని సిబ్బంది కోరుతున్నారు.

ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి


ప్రచార కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య

చిట్యాల : కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య కోరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రకు మద్దతు ఇవ్వాలని కోరుతూ కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బండ పెద్ద కృష్ణయ్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుబ్బ పద్మకుమార్, మాజీ వైస్ ఎంపీపీ బండ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఓబీసీ అధ్యక్షుడు ఎడ్ల మహాలింగం యాదవ్, నాయకులు గంగాపురం గణేశ్, కొడగండ్ల ఉపేందర్, మేడబోయిన నాగరాజు, గుణగంటి రాజు, బోనగిరి రమేష్ గుప్తా, వనమాల రమేష్‌నేత పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ఉత్సవాలు


పూజలో పాల్గొన్న బెటాలియన్ కమాండెంట్

నల్లగొండ రూరల్ : అన్నెపర్తి బెటాలియన్ వద్ద శుక్రవారం దుర్గామాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంత్రోచ్ఛరణల మధ్య వేదపండితులు యజ్ఞం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, లక్ష్మి, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్, అదనపు కమాండెంట్ రామకృష్ణ, వెంకన్న తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, కృష్ణార్జున్‌రావు, అశోక్, వెంకటేశ్వర్లు, యుగేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ డోజో టీంకు అవార్డులు

నకిరేకల్ : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో జరిగిన జపాన్ బ్రౌన్, బ్లాక్ బెల్ట్ డిప్లొమా సర్టిఫికెట్లు, అవార్డు పోటీల్లో నకిరేకల్ డోజో విద్యార్థులు అసోసియేషన్ చైర్మన్, సినీ హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అవార్డులు అందుకున్నారు. సర్టిఫికెట్లు అందుకున్న వారిలో విజయ్‌కుమార్, అంజి, సాయి, సింధు, కిరణ్, వీరస్వామి, సబిత, సత్యం, కౌశిక్, మేఘన, పార్థు, విన్ను, కమల్, మనోజ్, మనీరాలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్, ఎక్స్‌మేనర్ రాపోలు సదర్శన్, బోర్డు డైరెక్టర్ నరసింహాచారి, జిల్లా జనరల్ సెక్రటరీ అంతగి సోములు, మాస్టర్లు సురేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి

వరిచేల పరిశీలన

కేతేపల్లి : రైతులు వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారి వీరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడివాడ గ్రామంలో వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు తమ పంటపొలాల్లో నీరు నిలువ ఉండకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్గితెగులు సోకినట్లయితే లీటర్ నీటిలో 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రైతులు శ్రీను, నరేష్, శ్రావణ్, సూరయ్య, ఎంఏఓ పురుషోత్తం ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

నల్లగొండ టౌన్ : పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27,28 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బకరం శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొజ్జ దేవయ్య, దుబ్బ సత్యనారాయణ, కమలమ్మ, నాగరాజు, కరకొప్పల రాజు, బీపంగి అర్జున్, అశోక్, గిరి, రమేష్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.